క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ చౌరస్తా: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో ఆదివారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. కరీంనగర్ లోయర్ మానేర్ డ్యామ్ (ఎల్ఎండీ) పంప్ హౌస్‌లో మరమ్మతులు కొనసాగుతున్నందున ఎల్ఎండీ నుంచి ధర్మసాగర్ 60ఎంఎల్‌డీ రిజర్వాయర్‌కు వచ్చే నీటి సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. దాంతో వరంగల్ అండర్ రైల్వే జోన్‌ప్రాంతంలో నీటి సరఫరా ఉండదని ఒక ప్రకటనలో వివరించారు. కరీమాబాద్, పెరుకవాడ, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశి కుంట, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలా నగర్, కాశికుంట, ఖిలావరంగల్, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కల్లపల్లి, లక్ష్మీపురం, బట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ, దేవన్నపేట ప్రాంతాల్లో సోమవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.

నేడు త్యాగరాజ ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు బాహ్యావరపు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు త్యాగరాజ వేషధారణలో నగర సంకీర్తన సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీత కళాకారులు, తదితరులు హాజరవుతాయని తెలిపారు.

మహమ్మద్ అన్వర్‌కు డాక్టరేట్



కాజీపేట అర్బన్: అయాన గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్, సామాజిక వేత్త మహమ్మద్ అన్వర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ యూఎస్ఏ గౌరవ డాక్టరేట్‌ను శనివారం అందజేసింది. నగరానికి చెందిన అన్వర్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు గాను చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో అన్వర్‌కు డాక్టరేట్ పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ను అందజేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



ఖిలా వరంగల్: గత నెల 24న శాంతినగర్ కరీమాబాద్ రోడ్డుపై నర్సంపేటకు చెందిన మోర సునీల్ తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దాంతో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ సహాయంతో ఆ ఫోన్‌ను పోలీసులు గుర్తించి ఇన్‌స్పెక్టర్ మల్లయ్య చేతుల మీదుగా బాధితుడు సునీల్‌కు శనివారం అందజేశారు.

టీ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శిగా సుభానీ



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ రాయపురకు చెందిన మహ్మద్ సుభానీ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు సన్నీషా ఉత్తర్వులు జారీ చేసినట్లు సుభానీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సన్నీషా, సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బాలినే శ్రీనివాసరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాలపై అధికారులు చర్య తీసుకోవాలి

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్న నిర్మాణాలను గుర్తించి బాధ్యులపై మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో శనివారం ఆయన మాట్లాడుతూ యథేచ్ఛగా అక్రమంగా భవనాల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన వాపోయారు.

బీఆర్ఎస్ ద్రోహాన్ని మరువలేం

హన్మకొండ చౌరస్తా: కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు తీరని ద్రోహం చేసిన బీఆర్ఎస్ పార్టీ చరిత్రను ఎవరూ మరిచిపోలేరని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ ఆఫీసులో శనివారం జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ త్యాగాలు, ఉద్యమ చరిత్రను ఎవరూ చెరిపేయలేరన్న దేశపతి వ్యాఖ్యలపై రాజేంద్రప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఇంకా ఎన్నాళ్లూ గడీలకు ఊడిగం చేస్తావని దేశపతిని ఉద్దేశించి ప్రశ్నించారు. నిజమైన ఉద్యమకారులను దేశపతి కించపరిచారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్, కాశీం, విమలక్కపై ఉపా కేసులు, దేశ ద్రోహం కేసులు పెడితే దేశపతి ఎందుకు ఖండించలేదని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు ఊరుకోరన్న విషయాన్ని బీఆర్ఎస్ గ్రహించాలని తెలిపారు.

కార్మిక, కర్షకుల రక్షణకు దేశవ్యాప్త బంద్



వరంగల్ చౌరస్తా: మాట్లాడుతున్న రమేష్



హన్మకొండ: సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు, ఆర్టీసీ కార్మికులు

వరంగల్ చౌరస్తా: దేశీయ వ్యవసాయం, రైతాంగం, కార్మికుల హక్కుల రక్షణకు, దేశాన్ని కాపాడుకునేందుకు ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్, కార్మిక సమ్మెను నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ తెలిపారు. ఈక్రమంలో అన్ని వర్గాల ప్రజలు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌కేఎం కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్‌లో రౌండ్ టేబుల్ జిల్లా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్లు గోనె కుమారస్వామి, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు గంగుల దయాకర్, ముక్కెర రామస్వామి, నర్ర ప్రతాప్, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, సుంచు జగదీశ్వర్, ఓదెల రాజన్న, కోరబోయిన కుమారస్వామి ఎండీ.ఇస్మాయిల్, కందిక చెన్నకేశవులు, ఎండీ.కాసిం, గజ్జల లింగమూర్తి తదితరులు హాజరయ్యారు. సమావేశంలో వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఐతం నాగేష్, అశోక్, ఊరటి అంశాల రెడ్డి, మోకిడి పీరయ్య, మైదం పాణి, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

కనీస వేతనం చెల్లించాలి

వరంగల్: జిల్లాలోని సామిల్‌లలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సమ్మె వాల్‌పోస్టర్లను ములుగు రోడ్డు హనుమాన్ జంక్షన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 16న జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ సామిల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురాసిరాజ్ ముకుందం, సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, గోనె కుమారస్వామి, జిల్లా కన్వీనర్లు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, గంగుల దయాకర్, ముక్కెర రామస్వామి, నర్రా ప్రతాప్, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, సుంచు జగదీశ్వర్, ఓదెల రాజన్న, కె.కుమారస్వామి, ఎండి.ఇస్మాయిల్, చెన్నకేశవులు, ఎండీ.ఖాసీం, లింగమూర్తి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

హన్మకొండ: ఈనెల 16 నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కోశాధికారి ఎస్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్లను హనుమకొండలోని వరంగల్ -1, వరంగల్ -2, హనుమకొండ డిపోల వద్ద ఆర్టీసీ కార్మికులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ సంహిత బిల్లు ద్వారా డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆరోపించారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు రవీందర్, బీయూ.చారి, వై.శ్రీనివాస్, మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు భారత శాంతి దూతలే



స్వామినాథన్‌కు అవార్డు అందజేస్తున్న వరల్డ్ పీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ (ఫైల్)



పీవీకి భారత్ శాంతి దూత్ అవార్డు ప్రకటించిన సందర్భంగా.. (ఫైల్)

హన్మకొండ కల్చరల్: భారత ప్రభుత్వం ప్రకటించిన అత్యున్నతమైన ఐదు భారతరత్న అవార్డుల్లో.. అంతర్జాతీయ శాంతి సంస్థ 'వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ' ప్రదానం చేసే భారత్‌శాంతి దూత్ అవార్డులను గతంలో అందుకున్న వారిలో ఇద్దరు ఉండటం విశేషం. భారత్ శాంతి దూత్ అవార్డు అందుకున్న ఇద్దరిలో ఒకరు ప్రొఫెసర్ ఎమ్ఎస్ స్వామినాథన్ కాగా, మరొకరు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు. ఈ మేరకు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ శనివారం మాట్లాడుతూ సంస్థ నుంచి అందించే భారత శాంతి దూత్ అవార్డులను 2017వ సంవత్సరానికి 2018, మార్చి 10న ఎంఎస్ స్వామినాథన్‌కు అందజేశామని, 2020వ సంవత్సరానికి పీవీ నర్సింహారావుకు ప్రకటించిన అవార్డును 2021, అక్టోబర్ 23న పీవీ కుమార్తె వాణీదేవికి అందజేసినట్లు వివరించారు.

'ఆర్ట్స్' పూర్వ విద్యార్థి పీవీకి భారతరత్న



పీవీకి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థి పీవీ నర్సింహారావుకు ప్రతిష్ఠాత్మక భారతరత్నం రావడం ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య కొనియాడారు. పీవీకి కేంద్రం భారతరత్నను ప్రకటించడాన్ని హర్షించారు. ఈమేరకు కళాశాలలో పీవీ చిత్రపటానికి ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో పీవీ నిరాడంబరం, నిబద్ధత కలిగిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సెలవురోజుగా ప్రకటించడం హర్షణీయం



రాణు నాయక్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: లంబాడ జాతి ఆరాధ్య దేవమైన సంత్ సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవురోజుగా ప్రకటించడంపై లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, రాష్ట్ర నాయకుడు బానోత్ నవీన్ నాయక్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 15న సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించిన సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని రాణా నాయక్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు జైసింగ్ రాథోడ్, లావుడియా రాజేష్ నాయక్, సమ్మయ్య రాథోడ్, సునీల్‌నాయక్, వెంకట్ నాయక్, తిరుపతి, దేవేందర్, పరమేష్, మాలోత్ బిక్కు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరి నిత్యగా రాజరాజేశ్వరి



హన్మకొండ కల్చరల్: మాఘ మాసం శుద్ధ పాడ్యమి సందర్భంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో శిశిర నవరాత్రులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షించారు.

భద్రాద్రిలో నిత్యాన్నదానానికి విరాళం



భద్రాచలం టౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హనుమకొండ జిల్లాకు చెందిన భక్తులు శనివారం విరాళం అందజేశారు. హనుమకొండ పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన వాకా సత్యనారాయణ - జయలలిత దంపతులు.. రూ.1,01,116 విలువగల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి సాయి బాబు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన



కరపత్రాలను చూపుతున్న ప్రదీప్‌రావు, తదితరులు

ఖిలా వరంగల్: దేశాభివృద్ధి, పేదల సంక్షేమం, సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమని పార్టీ నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా వరంగల్ 37వ డివిజన్ గిరిప్రసాద్‌నగర్, ఎంఎం.నగర్, బుడిగ జంగాల కాలనీకి చెందిన ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, డివిజన్ అధ్యక్షుడు గోల రాజ్‌కుమార్ అధ్యక్షతన బూత్ కమిటీల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం పలు కాలనీల్లో ప్రదీప్‌రావు పర్యటించారు. సమావేశంలో అరుణ్, పల్లెపు రాజు, రమేష్, నిరంజన్, నాగరాజు, శంకర్, నరసింహ, సంపత్, రామకృష్ణ, మల్లయ్య, ముఖేష్, కుమార్, రాకేష్, కేశవ్, నాగార్జున, పాషా, గొల్లన రవి, బొంత రాజు, సంపంగి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

మడికొండ: వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని, అమూల్యమైన ఫార్మసిస్ట్ సర్టిఫికెట్‌ను కిరాయికి ఇవ్వొద్దని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ సమ్మయ్య అన్నారు. రాంపూర్ శివారులోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్‌లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసిస్టులతో 100శాతం ఔషధాల పంపిణీ జరిగితే ప్రజల ఆరోగ్యానికి 100శాతం భద్రత ఉంటుందని అన్నారు. ఫార్మసిస్టులకు ఔషధాల గురించి, చికిత్సపరమైన అంశాలపై అవగాహన ఉంటుందని చెప్పారు. ఫార్మసిస్టులు మందులకు ప్రాణం పోస్తారని, ఆ మందులు రోగికి ప్రాణాలు పోస్తాయని వివరించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ శ్రీకాంత్, డైరెక్టర్ యుగేందర్, డిపార్ట్‌మెంట్ హెడ్ వెంకన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కుమార్‌యాదవ్

హన్మకొండ: బాలసముద్రంలోని షైన్ స్కూల్ యానువల్ రిఫ్లెక్షన్ 2023 -2024 కార్యక్రమాన్ని హనుమకొండ భీమారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల డైరెక్టర్ మూగల రమ, రాజేందర్, రమేష్, ప్రిన్సిపాల్ ఆర్.ప్రగతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన కల్పించాలి



డాక్టర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్: పాఠశాలలోని విద్యార్థులకు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి వారిని చైతన్య పరచాలని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఫార్మా డీ విభాగం ఆధ్వర్యంలో థీమ్ సిగ్నిఫికెన్స్ ఇనిషియేటివ్స్ ఫర్ చైల్డ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఆన్ డీవార్మింగ్‌పై విద్యార్థులకు శనివారం శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్ర గురించి వివరించారు. ఒకటి నుంచి 19ఏళ్ల గల వారు ఆల్బెండజోల్ 400గ్రాముల మాత్రను నమిలి మింగాలని సూచించారు. అనంతరం పీఎఎస్ఆర్ఎమ్ఓ డాక్టర్ సనత్‌రోషన్, శ్రీనివాస్‌ను సన్మానించారు. ఫార్మా డీ హెచ్ఓడీ డాక్టర్ శరవణభవ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఓడీలు డాక్టర్ వెంకటేశ్వర్లు, చందన, సుమంత్, ప్రవీణ్, సఫియా, మకరంద్, అగోహ జుబ్లీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు 'దీనబంధు' బాసట



డబ్బులు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గాలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం దీనబంధు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్, దర్గా వాసి డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. దీనబంధు సంఘాన్ని 15 ఏళ్ల క్రితం స్థాపించి పేదలకు బాసటగా నిలుస్తున్న పదవీవిరమణ ఉద్యోగులను ఆయన అభినందించారు. అనంతరం దీనబంధు లబ్ధిదారులైన 60 మందికి రూ.100 చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మోడెం సమ్మయ్య, కునమల్ల రాందాస్, శనిగారపు రాజమోహన్, కిషన్, జలీల్‌ఖాన్, ఉపేందర్, జహంగీర్, సుధాకర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో హాస్టల్ వసతి కల్పించాలి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో హాస్టల్ వసతి కల్పించాలని పలువురు విద్యార్థులు కోరారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ హనుమంతుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి భరత్ మాట్లాడుతూ దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లాంటి ఎంతోమంది ప్రముఖులు చదివిన 97ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ట్స్ కళాశాల.. పలు సమస్యలకు నిలయంగా మారిందని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో పరమేష్, గైక్వాడ్, నగేష్, శ్రీకాంత్, కావేరి, అక్షిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఎస్ఎస్ విద్యార్థి సత్తా



వరంగల్ అర్బన్: వరంగల్ బల్దియా ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న ఎస్ఎస్ కాన్సెప్ట్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సామల శ్రీచేతన్ శౌర్య.. అండర్ -13 ఆల్ ఇండియా బాలుర కేటగిరిలో 7వ ర్యాంక్ సాధించాడని కోచ్ మాడిశెట్టి శ్రీధర్ తెలిపారు. డబుల్స్ కేటగిరిలో 10వ ర్యాంక్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారుడికి పాఠశాల యాజమాన్యం రూ.25 వేల నగదు, షటిల్ కిట్, షూస్, టీ షర్టును బహూకరించి, అభినందించినట్లు పేర్కొన్నారు.

శ్వేతార్కలో మహా పుష్పాభిషేకం

కాజీపేట: మాఘమాస ఉత్సవాలను పురస్కరించుకుని కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో స్వామివారికి లక్ష పూలతో శనివారం మహా పుష్పాభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పండితులు పుష్పాభిషేకం జరిపించారు. స్వామి వారికి నూతన వస్త్రాలతో పాటు బంగారు, వెండి నగలతో అలంకరించారు. కార్యక్రంలో సాయికృష్ణశర్మ, టంటం దయాకరశర్మ, హరిస్వామి, ఆలయ మేనేజర్ రవి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన డాక్టర్ రామకృష్ణ



హన్మకొండ చౌరస్తా: మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశీస్సులు కావాలని సీతక్కను ఆయన కోరారు. కాంగ్రెస్ పెద్దలు తనకే అవకాశం ఇస్తారన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు

మడికొండ: డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను మడికొండలో శనివారం నిర్వహించారు. ఈమేరకు మానుపాటి కిరణ్‌రాజ్ (మాస్) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, సందెల విజయ్, నీలం వేణుయాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు దువ్వ విజయ్, పల్లపు అర్జున్, గణేష్‌యాదవ్, టేకుమట్ల నాగరాజు, గడుసు రాజు, గోపి, ప్రశాంత్, వేణు, శ్రీను, సునీల్, కొలంబో అశోక్, చంటి తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాఘవరెడ్డి జన్మదిన వేడుకలను మాజీ వైస్ ఎంపీపీ బిల్లా రవీందర్ ఆధ్వర్యంలో బెంగుళూరులో ఘనంగా నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తురుజెండాలో అనుమానాస్పద స్థితిలో రంగు భాస్కర్ (50) మృతి చెందినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. శనివారం ఇంటి వద్ద భాస్కర్ కనిపించకపోవడంతో హైదరాబాద్‌లో ఉన్న అతని భార్యా పిల్లలకు స్థానికులు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి భాస్కర్ శరీరంపై గాయాలు ఉండటంతో మృతుడి కుమారుడు నవీన్ భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సోమిడిలో చోరీకి యత్నం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన కొంరయ్య అనే రైతు ఇంటిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి చొరబడి చోరీకి యత్నించారు. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కొంరయ్య కుటుంబ సభ్యులు ఆరుబయట వివిధ పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి చేరాడు. ఇంటిలో శబ్దాలు రావడంతో అనుమానం వచ్చి బాధిత కుటుంబ సభ్యులు లోపలికి వెళ్తుండగా, అది గమనించి నిందితుడు పరుగెత్తుకుంటూ సోమిడి ఊర చెరువు కట్టపై ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వైపు వెళ్లి ఓ ద్విచక్ర వాహనంపై కాజీపేట వైపు వెళ్లాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి నిందితుడిని పట్టుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రాష్ట్ర చిహ్నంలో మార్పు సరికాదు

కాజీపేట అర్బన్: రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తామన్న నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఉపసంహరించుకోవాలని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. కడిపికొండలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చిహ్నాం రాచరిక పోకడలతో ఉందని కాకతీయ కళాతోరణాన్ని మారిస్తే ఊరుకునేది లేదన్నారు.

నేటి విద్యా విధానంలో మార్పు రావాలి



గవర్నర్‌కు నివేదిక అందిస్తున్న తిరుపతి రెడ్డి

హన్మకొండ: గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను హనుమకొండకు చెందిన ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి కలిశారు. హైదరాబాద్ రాజభవన్‌లో గవర్నర్‌తో పాటు గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి 'నేటి విద్యా విధానం - సమూల మార్పులు' అనే అంశంపై నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో మార్పు రావాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో చదువులకు, ఉద్యోగ నైపుణ్యాలకు మధ్య సంబంధం ఉండడం లేదని పేర్కొన్నారు. ప్రతీ పదిమందిలో ఒకరికే ఉద్యోగ నైపుణ్యాలు ఉంటున్నాయని చెప్పారు. ఎప్పుడో కాలం చెల్లిన నాటి ఉద్యోగాలకు తగ్గట్టుగా విద్యాబోధన ఉండడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని గవర్నర్‌కు ఆయన వివరించారు. కేఎస్ఆర్ పబ్లిషర్స్ అధినేత డాక్టర్ కేఎస్ఆర్ శ్రీనివాస్, విద్యాసంస్థల ప్రముఖులు సాంబయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

'ప్రోగ్రెస్'లో కలర్ క్యాప్స్ వేడుకలు



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని రెడ్డి కాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌లో కలర్ క్యాప్స్ వేడుకలను శనివారం నిర్వహించారు. తమ ఇంటిలో తయారుచేసిన రంగు, రంగుల టోపీలను నర్సరీ, ఎల్‌కేజీ చిన్నారులు ధరించి స్కూల్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ మల్లాడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత పెంపునకు, చదువుపై శ్రద్ధ పెట్టేందుకు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఆశిష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, టీచర్లు కవిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.